

సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకుడు గోవింద్ తదితరులు

సీఎంకు ముషీరాబాద్ కాంగ్రెస్ నేతల సన్మానం

ముషీరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి. గోవింద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శుక్రవారం గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి త్రివర్ణ రూపంలో ఉన్న తలపాగాను బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, నాయకులు చారి, పట్నం నాగభూషణం గౌడ్, లింగం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



కుష్టువ్యాధి నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి, డాక్టర్ మనోజ్‌రెడ్డి

కుష్టు వ్యాధిగ్రస్తులు సామాజిక జీవితం గడపొచ్చు

● డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి

ముషీరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిగ్రస్తులు సామాజిక జీవితం గడపవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎం అండ్ హెచ్‌ఓ) డాక్టర్ వెంకటి అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (యూపీహెచ్‌సీ) ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమానికి డాక్టర్ వెంకటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులతో కలిసి కుష్టువ్యాధి నివారణ కోసం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కుష్టువ్యాధి బ్యాక్టీరియా ద్వారా చర్మానికి, నరాలకు సోకుతుందని తెలిపారు. ఈ వ్యాధికి వయసు, లింగబేధం లే దని, సకాలంలో మందులు వాడితే నివారించవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ వ్యాధికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, పీహెచ్‌ఎన్‌లు కళమ్మ, పెల్లీస్, ఏఎన్‌ఎం విజయ్‌కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

●పోలీసులకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

ముషీరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్యకర పోస్టులు, తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ముషీరాబాద్ సీఐ రాంబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవింద్, జీఎన్ చారి, జయకుమార్, ఆరిఫ్, లింగంగుప్తా విలేకరులతో మాట్లాడుతూ, రాజకీయంగా కాంగ్రెస్‌ను దెబ్బ తీసేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ పోస్టులు పెడుతున్నారన్నారు. అయితే, వాస్తవాలను గుర్తించిన ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని వారు అన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రొ. వెంకట్ రాజయ్య



చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, నల్గొండ, వరంగల్, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రొ. వెంకట్ రాజయ్యను స్కూల్స్, కాలేజెస్ యూనివర్సిటీస్ టీచర్స్ ఆర్గనైజేషన్ (స్యూటో) జేఏసీ ప్రకటించింది. జేఏసీ ప్రతినిధులు జస్టిస్ చంద్రకుమార్, ప్రొ. సింహాద్రి, ప్రొ.మురళి మనోహర్, ప్రొ. కొండా నాగేశ్వరరావు, ప్రొ. గడ్డం మల్లేశం, రాజకీయ జేఏసీ కన్వీనర్ కోల జనార్దన్‌లు తనకు మద్దతుగా రావడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ప్రొ. వెంకట్ రాజయ్య అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సేవ్ కానిస్టిట్యూషన్, సేవ్ డెమోక్రసీ, సేవ్ గవర్నమెంట్ ఎడ్యుకేషన్ అనే నినాదంతో తాను ఎన్నికల్లో ముందుకు వెళ్తున్నానని తెలిపారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం సహకరించాలి

●తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం

బర్కత్‌పుర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లిలో ఉద్యోగులు, పెన్షనర్లకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం సహకరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లి, కోశాధికారి జె.ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షురాలు ఎం.స్వర్ణకుమారి, సంయుక్త కార్యదర్శి కటకం యూన్సీ, అబ్దుల్ సాధిక్‌లు కోరారు. శుక్రవారం సంఘం రూపొందించిన 2025 క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఆవిష్కరించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని డా.చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ ఇళ్ల స్థలాలను లాక్కుని అన్యాయం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల 'కెరీర్ కౌన్సిలింగ్' మాడ్యూల్‌ను తెలుగులో ముద్రించాలని వినతి

గోల్నాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలోని ఉపాధ్యాయులకు కెరీర్ కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్ మాడ్యూల్‌ను తెలుగులో ముద్రించి పంపిణీ చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) అధ్యక్షుడు డాక్టర్ శ్రీవాటి శ్రీనాథ్, ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్.విజయభాస్కర్, కోశాధికారి మీనాకుమారి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర శిక్షణ మరియు పరిశోధన(ఎస్సీఆర్టీఈ)డైరెక్టర్ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఇంగ్లీషులో మాడ్యూళ్లను పంపిణీ చేశారని, తెలుగు మాధ్యమంలో బోధిస్తున్న ఉపాధ్యాయులకు అర్థం గాక అయోమయానికి గురవుతున్నారని వారు తెలిపారు. తెలుగులో కెరీర్ కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్ మాడ్యూల్‌ను ముద్రించి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

హెచ్‌యూజే పేరును అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

●కార్మికశాఖ అధికారులకు సంఘం ప్రతినిధుల ఫిర్యాదు

చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తొలిసారి ప్రభుత్వ గుర్తింపు పొందిన స్థానిక జర్నలిస్టుల సంఘం హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్(హెచ్‌యూజే రి.నెంబర్ బి 2794)పేరును అనధికారికంగా ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్‌యూజే ప్రతినిధి బృందం కార్మికశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. రిజిస్టర్డ్ హెచ్‌యూజే సంఘం అధ్యక్షుడు బి. అరుణ్‌కుమార్, కార్యదర్శి బి. జగదీశ్వర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.గంగాధర్, సంయుక్త కమిషనర్ సునీతా గోపాల్‌దాస్‌తో సమావేశమయ్యారు. జర్నలిస్టుల సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి హెచ్‌యూజే కృషి చేస్తోందన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) సంఘం తమ హైదరాబాద్ యూనిట్‌కు అనధికారికంగా హెచ్‌యూజే పేరును ఉపయోగిస్తున్నారని వారికి ఫిర్యాదు చేశారు. దానికి సంబంధించిన ఆధారాలను అందజేశారు. ఈ విషయంపై విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ గంగాధర్ హామీ ఇచ్చారు. రాజశేఖర్ నవీన్, మధుకర్ రమేష్, రేణయ్య, జీవన్‌రెడ్డి, ప్రశాంత్ విజయానంద్, హరిప్రసాద్, రోజారాణి పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



నల్లకుంట కూరగాయల మార్కెట్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు





కూల్చివేతల నేపథ్యంలో తమ షాపుల్లోని పండ్లు, ఇతర సామగ్రిని తరలిస్తున్న వ్యాపారులు

రోడ్డు ఆక్రమణలపై అధికారుల కొరడా

● నల్లకుంట కూరగాయల మార్కెట్ రోడ్డులో 40 షాపులు, 50 తోపుడు బండ్లు తొలగింపు

నల్లకుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్ కూరగాయల మార్కెట్‌లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల కొరడా ఝుళిపించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులకు ఇరువైపులా రోడ్లపై ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన నేపథ్యంలో రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో పాటు నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో కూల్చివేతలు చేపట్టారు. గత 70 ఏళ్లుగా ఇక్కడ రోడ్లను ఆక్రమించి కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ సారథ్యంలో సిబ్బంది ఈ కూల్చివేతలు చేపట్టారు. పనులను ఎవ్వరూ అడ్డుకోకుండా నల్లకుంట ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నల్లకుంట ప్రధాన రహదారి నుంచి బాగ్‌లింగంపల్లి వరకు వెళ్లే దారిలో ఈ కూల్చివేతలు జరిగాయి. రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న 50 తోపుడు బండ్లు, 40 తాత్కాలిక షాపులను అధికారులు ప్రొక్లెయినర్ సహాయంతో ధ్వంసం చేశారు. షాపులు, తోపుడు బండ్లను తొలగించిన తర్వాత ఈ రోడ్డు పూర్తి వెడల్పుగా మారింది.

నిత్యం ట్రాఫిక్ జామ్...

నల్లకుంటలోని కూరగాయల మార్కెట్ రోడ్డు గతంలో దాదాపుగా 50 నుంచి 60 ఫీట్ల వెడల్పుతో ఉండేది. ఆక్రమణ కారణంగా ఈ రోడ్డు వెడల్పు 25 నుంచి 30 ఫీట్లకు తగ్గిపో యింది. ఇరుకుగా మారిన ఈ రోడ్డుపైనే కూరగాయల వ్యాపారులు తోపుడు బండ్లను నిలిపేవారు. దీంతో ఈ ప్రాంతంలో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ అయ్యేది. ఈ సమస్యను పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి పలువురు ఫిర్యాదులు చేయడంతో ఎట్టకేలకు నల్లకుంట కూరగాయల మార్కెట్‌లో ఆక్రమణలను తొలగించారు.



మార్కెట్‌లో ప్రధాన షాపుల ముందు ఉన్న తోపుడు బండ్లు, తడికెల షెడ్డులను కూల్చివేస్తున్న దృశ్యం



కూల్చివేతల అనంతరం ఇలా..

తిరిగి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఈ కూల్చివేతలు చేపట్టామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తెలిపారు. రోడ్లను ఆక్రమించి తిరిగి ఎవరైనా షాపులను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తోపుడు బండ్లు, తాత్కాలిక దుకాణాల వల్ల రోడ్డు ఇరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు అనేక సమస్యలు తలెత్తేవన్నారు. ఇక్కడ అనుమతులు లేకుండా కూరగాయల వ్యాపారం చేశారని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం చేపట్టిన ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు పనులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రధాన రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. రోడ్ల మధ్యలోని డివైడర్లు కుచించుకుపోవడంతో వాహనదారులు యూటర్న్ తీసుకోకుండా రహదారుల మధ్య నుంచే వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారుల్లో కొత్త డివైడర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి రత్నానగర్ వరకు బ్రిడ్జి మధ్యలో రూ. 44 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన డివైడర్ల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పాదయాత్ర చేసి పాతరామాలయం వీధిలో డ్రైనేజీలోని వ్యర్థాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రధాన రహదారుల్లో యూటర్న్ వద్ద సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు మధ్యలో నూతన డివైడర్ల నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కె.ప్రశాంత్‌జోషి, నల్లకుంట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్, నాయకులు ఎంబీ కిషోర్‌కుమార్, జి.శంకర్, మోహన్, జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్‌బాబు, డీఈ ప్రశాంతి, ఏఈ పృథ్వి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో రోడ్డు డివైడర్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ అమృత



మందకృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మందకృష్ణ మాదిగకు 'పద్మశ్రీ' అణగారిన వర్గాలకు గుర్తింపు

●జాజుల శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు లభించడం అభినందనీయమని, ఇది అణగారిన వర్గాలకు గుర్తింపు అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పద్మశ్రీ అవార్డు లభించిన మందకృష్ణమాదిగను శుక్రవారం అంబర్‌పేటలోని ఆయన నివాసంలో కలిసి పూలబొకే ఇచ్చి శాలువాకప్పి సత్కరించారు. ఇది బలహీన వర్గాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. మందకృష్ణమాదిగను కలిసిన వారిలో బీసీ సంఘం నేతలు కుందారం గణేష్‌చారి, బాల్‌రాజ్‌గౌడ్, సదానందం ఉన్నారు.



నర్సింగ్‌రావుయాదవ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు

నర్సింగ్‌రావు యాదవ్‌కు బీజేపీ నేతల అభినందనలు


గోల్నాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్‌ను కేంద్ర కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ హైదరాబాద్ టెలికమ్యూనికేషన్ సలహా కమిటీ సభ్యుడిగా నియమించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు బీజేపీ గోల్నాక డివిజన్ నాయకులతో కలిసి కేసరి నర్సింగ్‌రావు యాదవ్‌ను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తకు, నాయకుడికి సరైన సమయంలో సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. బీజేపీ నాయకులు మూల రవీందర్‌గౌడ్, సూదగాని శ్రీధర్‌గౌడ్, మరికంటి కృష్ణంరాజు, ఆర్‌వీఎల్ రమేష్, కర్రీ రవీందర్, డిఆర్‌ఎస్ నరేంద్ర, ప్రకాష్‌రెడ్డి, కె.కృష్ణ, జి.వంశీకృష్ణ, టి.శ్రీరామ్, సంతోష్‌వర్మ, అనిల్‌కుమార్, నిరంజన్ పాల్గొన్నారు.



డాక్టర్ చిరంజీవిని సత్కరిస్తున్న అధ్యాపకులు

ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్స్ కమిటీ సభ్యుడిగా డాక్టర్ చిరంజీవి

బర్కత్‌పుర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్స్ కమిటీ సభ్యుడిగా కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రాంగణంలో డాక్టర్ చిరంజీవిని అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. నగరంలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానని డాక్టర్ చిరంజీవి అన్నారు. మార్చి నెలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రిన్సిపాల్స్ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గీతాబాయి, ప్రసాదరావు, రజని, రామ్మోహన్, అనిల్‌రెడ్డి, గణేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను సన్మానిస్తున్న డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోవర్దన్ రెడ్డి తదితరులు

కేరళ గవర్నర్‌కు డీడీ కాలనీ అసోసియేషన్ సత్కారం

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని డీడీ కాలనీలోని తన బంధువుల ఇంటికి వచ్చిన కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌కు శుక్రవారం డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పక్షాన స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా సత్కరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి. గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పుట్ట పాండురంగయ్య, సభ్యులు కరణ్‌రెడ్డి, రఘువీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు మరణం లేదు.. ప్రజల హృదయాల్లోనే ఉన్నారు

●తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

బర్కత్‌పుర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజల హృదయాలలో ఉన్న గద్దర్ పాట, మాట అవసరమైనప్పుడు తుపాకీ తూటా అయి పేలుతుందని తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. గద్దర్ జీవితం అంతా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశాడని అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ అభిమానుల సంఘం ప్రతినిధులు సీఎల్ యాదగిరి, నిమ్మ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ సాగుతున్న ప్రజా పాటల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడమే కాక 78వ జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెన్నెల గద్దర్ మాట్లాడుతూ, గద్దర్ యుగపురుషుడని, ఆయన జీవితాన్ని రాస్తే అది ఒక మహాగ్రంథం అవుతుందని అన్నారు. గద్దర్‌కు మరణం లేదని, ఆయన ప్రజల హృదయాలలో ఉన్నాడని అన్నారు. అణచివేత, దోపిడీపై గద్దర్ పాడిన పాటలు తిరుగుబాటు గేయంగా చిరకాలం ఉంటాయన్నారు. గద్దర్ జీవిత కాలం అంతా ఆడపిల్లలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, నిర్మల జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కల్చరల్ సెల్ అధ్యక్షుడు చక్రాల రవి, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు గంట మల్లేష్, గాయకులు డాక్టర్ మాష్టార్జీ, నేర్నాల కిషోర్, లెల్లె సురేష్, వరంగల్ రవి, నల్లమల్ల యాదగిరి, బుద్దిస్ట్ హరినాథ్, వివిధ సంఘాల నేతలు రాజలింగం, జి.శంకర్, ఐలయ్య, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వెన్నెల గద్దర్, సీఎల్ యాదగిరి తదితరులు

బాక్సింగ్‌లో కానిస్టేబుల్ సోదరులకు గోల్డ్‌మెడల్



బంగారు పతకం సాధించిన ప్రశాంత్, ప్రభు

చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్‌గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2025 కరీంనగర్‌లో ఇటీవల జరిగింది. బాక్సింగ్‌లో గోల్డ్‌మెడల్ సంపాదించుకున్న అన్నదమ్ములు పి. ప్రశాంత్, పి. ప్రభులు ముషీరాబాద్ నియోజకవర్గం ముద్దుబిడ్డలు. ఎన్నో రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన ఈ యోధులు గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ నివాసి పి. సాయికీర్తి కుమారులు. కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న తాము బాక్సింగ్‌లో గోల్డ్‌మెడల్ సంపాదించడానికి సహకరించిన కోచ్‌తో పాటు తల్లిదండ్రులు, తెలంగాణ పోలీస్ అధికారులకు ప్రశాంత్, ప్రభులు కృతజ్ఞతలు తెలిపారు.

గౌడ వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

గాంధీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గౌడ వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం ఎక్సైజ్ శాఖ కమిషనర్ కేటీకే శాస్త్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 2 లక్షల 25 వేల మంది గౌడ వృత్తిదారులకు గుర్తింపు కార్డులు వెంటనే జారీ చేసి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. ప్రమాదంలో మరణించిన, అంగవైకల్యం కుటుంబాలకు సంబంధించి రూ. 8 కోట్ల నిధులను విడుదల చేసి బాధితులకు అందించాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో గౌడ జన హక్కుల పోరాట సమితి నాయకులు కె.ఆంజనేయులుగౌడ్, బి.బుచ్చయ్యగౌడ్, డి.సోమన్నగౌడ్, అశోక్‌గౌడ్, వీరన్నగౌడ్, మహేష్‌గౌడ్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇచ్చేందుకు సీఎం కృషి

● రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఛైర్మన్ గుర్రం శంకర్



ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న గుర్రం శంకర్

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఛైర్మన్ గుర్రం శంకర్ అన్నారు. ముషీరాబాద్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్వ హిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా సర్వే రిపోర్టు తయారు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ముషీ రాబాద్‌లోని అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు.



రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్

ఉన్నత విద్య సిలబస్‌ను మార్చాల్సిన అవసరం ఉంది

● రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ. బాలకృష్ణారెడ్డి

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మారిన పరిస్థితులు, విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉన్నత విద్య సిలబస్‌ను మార్చాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. ఈ విషయంపై ఉన్నత విద్యామండలి తరపున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. తెలంగాణ రిటైర్డ్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ శుక్రవారం విద్యానగర్‌లోని ఆంధ్ర మహిళా కళాశాల ఆడిటోరియంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటరెడ్డి, ఎ.పుల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక మార్పులు వచ్చాయని, వాటికి అనుగుణంగా ఉన్నత విద్య సిలబస్‌ను మార్చి విద్యార్థులకు ఆధునిక సిలబస్‌ను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ఉన్నత విద్యామండలి ప్రణాళిక రూపొందిస్తోందన్నారు. అసోసియేషన్ సహాయ కార్యదర్శులు డి.ధర్మేందర్, కె.ఐలయ్య, కార్యదర్శి రమణయ్య,సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి,రాధాకృష్ణమూర్తి, బాలరాజు పాల్గొన్నారు.